


జి. అనసూయ

# బహుమతి

ఇంకో పది నిమిషాల్లో హైద్రాబాదు ఎయిర్‌పోర్టులో ప్లేన్ లాండ్ అవబోతున్నట్టు అనౌన్స్‌మెంట్ వినిపించింది. ఎన్నో ఏండ్ల తరువాత నేను పుట్టిపెరిగిన నగరాన్ని చూడబోతున్నందుకు ఎగ్జైటింగ్‌గా ఉంది. మరి కొద్దిసేపటిలో ప్లేన్ లాండవడం ప్రయాణికులంతా దిగడం, తమను రిసీవ్ చేసుకోవడానికి వచ్చిన బంధువులను స్నేహితులను ఆతృతగా పలకరించుకోవడం.. అంతా సందడిగా ఉంది. కొత్తగా సిటీకి దూరంగా కట్టిన ఎయిర్‌పోర్టు కావడాన విశాలంగా, పరిశుభ్రంగా ఉంది. లగేజి కొరకు వెయిట్ చేస్తుండగా మిత్రా వచ్చాడు. హాయ్ గౌతమ్... ప్రయాణం బాగా జరిగిందా అంటూ.

"వండర్‌ఫుల్ మిత్రా... మీరెలా ఉన్నారు. మీరు ఇక్కడ చేస్తున్నట్టు నాకు తెలియనే తెలియదు" అన్నాను.

"నేను కూడా మిమ్మల్ని సర్‌ప్రైజ్ చేద్దామనే చెప్పలేదు. ఎయిర్‌పోర్టుకు ఎవర్ని పంపాలా అని ఆలోచిస్తుంటే నేనే చెప్పాను. నేను గౌతమ్‌ని గుర్తుపడతానని". "ఎనీహౌ థాంక్యూ మిత్రా ! మీరు కలిసినందుకు నాకు చాలా సంతోషంగా ఉంది." ఇద్దరం కార్లో నా కొరకు బుక్ చేసిన హోటల్‌కి వచ్చాము. విశాలంగా రోడ్లు, ఫ్లైవోవర్లు... సిటీ చాలా మారింది. పెద్దపెద్ద షాపింగ్ మాల్స్ ఎత్తైన అపార్ట్‌మెంట్స్ అప్పట్లో గగన్‌విహార్ ఒక్కటే ఎత్తైన బిల్డింగ్ అనుకునేవాళ్లం.




నన్ను హోటల్ రూంలో దింపి, "మీరు రిలాక్సవండి గౌతం. పది గంటలకు డ్రైవర్ వచ్చి మిమ్మల్ని ఆఫీసుకు తీసుకు వస్తాడు" అంటూ వెళ్ళిపోయాడు మిత్రా.

హోటల్ నాలుగవ అంతస్తు లోని ఆ రూం కిటికీలోంచి బయటకు చూస్తే దూరంగా హుస్సేన్ సాగర్. మారిన కాలానికి గుర్తుగా ఎత్తైన బుద్ధ విగ్రహం. ఇరవై అయిదేళ్ళ క్రితం నాన్నగారి ట్రాన్సఫర్ వల్ల దూరమైన ఈ నగరానికి మళ్ళీ ఇప్పుడు రావడం యాధృచ్చికం కాదు. నాకు ఆంధ్రప్రదేశ్‌లో ఇచ్చిన మూడు ఆప్షన్స్‌లో నేనే హైద్రాబాద్ కోరుకున్నాను. ఉద్యోగరీత్యా దేశమంతా పలు ప్రాంతాలు తిరిగిన నేను సెటిల్ అవడానికి హైద్రాబాదే ఎంచుకోవడానికి... నా బాల్యం అంతా ఇక్కడ గడపడం, అమ్మా, నాన్న అన్నయ్య అభి కలిసి పంచుకున్న జీవితానుభూతులకు ఇదే భూమిక కావడం ఓ కారణం. వీలయితే ఓ ఇల్లే కొనాలి. ఆ ఆలోచన రావడంతోనే పేపర్లో క్లాసిఫైడ్స్ చూడడం మొదలు పెట్టాను. నాకు అందుబాటులో ఉన్న ధరల్లో ఉన్నవి టిక్ పెట్టాను. మిత్రాకు కూడా చెప్పాలి, అనుకున్నాను.

ఆ సాయంత్రం మిత్రా ఇంటికి తీసుకెళ్ళాడు. విద్యానగర్ ప్రాంతంలో ఫ్లాట్‌లో ఉంటున్నాడు. నా మనసులో మాట చెప్పాను. ఓ ఇల్లు కొనాలని ఉందని. "గుడ్ ఐడియా గౌతమ్. ఈ అపార్ట్‌మెంటులోనే సెకండ్ ఫ్లోర్‌లో ఓ ఫ్లాట్ అమ్మకానికుంది చూద్దామా" అన్నాడు మిత్రా.

"ఊహూ.. లేదు మిత్రా నేను ఇండిపెండెంట్ హౌస్ కొనాలను కుంటున్నాను. కొంచెం ఓపెన్ ప్లేస్... చిన్న గార్డెన్ అలా...."

"చిన్న గార్డెన్ కూడా పెద్దకోరికే మిత్రమా. హైద్రాబాదు నగరంలో. చూస్తున్నావుగా భూముల ధరలకు రెక్కలొచ్చి ఆకాశంలో ఎగురుతున్నాయి. అయినా ప్రయత్నిద్దాం" అంటూ ఓ రియల్ ఎస్టేటు బ్రోకరుకు ఫోను చేశాడు. పది నిమిషాల్లో ఓ వ్యక్తి వచ్చాడు. కొన్ని కాగితాలు ఓ రిజిస్టరు పట్టుకొని.

"ఇతను అశోక్ ఇండ్లు అమ్మడం, కొనడం మీడియేషన్ చేస్తుంటాడు అంటూ పరిచయం చేశాడు.

"చెప్పండి సార్ మీకు ఎలాంటి ఇల్లు కావాలి," అన్నాడు అతను వరాలు ఇచ్చే దేవుడిలా.

ఇల్లు చిన్నదైనా ఫరవాలేదు. ఓపెన్ ఏరియా ఉన్న ఇండిపెండెంట్ ఇల్లు కావాలని చెప్పాను.

"ధర చాలా అవుతుంది సార్... ఇప్పుడంతా అపార్ట్‌మెంట్ కల్చర్ ఉంది. మూడు నాలుగు వందల గజాల ఇల్లుంటే కూల్చేసి అపార్టుమెంట్లు కడుతున్నారు. అయినా ప్రయత్నిద్దాం..... ధర ఎంతైనా ఫరవాలేదు గద సార్" అన్నాడు అశోక్. అవును కాదు మధ్యలో తలూపాను.

నా ఫోను నెంబరు తీసుకొని మర్నాడు కలుస్తానని వెళ్ళిపోయాడు అతను.

ఆ రాత్రి మిత్ర ఇంట్లో భోజనం చేసి హోటల్‌కు వచ్చాను. మర్నాడు ఆదివారం. ఉదయం లేచి పేపరు చూస్తుండగా ఫోను చేశాడు అశోక్. గౌతమ్ సాబ్ మీరు కోరుకున్నట్లు ఓ ఇల్లు బేరానికొచ్చింది. మీ అడ్రసు చెబితే నేనొచ్చి మిమ్మల్ని పికప్ చేసుకుంటాను అన్నాడు. అడ్రసుచెప్పి రెడీ అవడం మొదలుపెట్టాను. అరగంటలో అశోక్ వచ్చాడు. అశోక్ కార్లో బయలుదేరాము. రియల్‌ఎస్టేట్ బ్రోకరు కారు మెయిన్‌టేన్ చేస్తున్నాడంటే... బాగా సంపాదన ఉన్నట్టే అనుకున్నాను. విద్యానగర్ దాటి రామ్‌నగర్ వైపు వెళుతోంది కారు. అవును. మేం చిన్నతనంలో ఉన్నది ఆ ఏరియాలోనే... కాని గుర్తు పట్టలేనంత మార్పు ఎక్కడ చూసినా బహుళ అంతస్తుల భవనాలు. రామ్‌నగర్ దాటి వారాసిగూడా దాటాము. ఆంజనేయస్వామి గుడి పక్క అయిదారు ఇండ్ల తర్వాత ఓ పెద్ద గేటు ముందు ఆగింది కారు. ఇది ఇది తమ ఇల్లే తను పుట్టి పెరిగిన ఇల్లు. అమ్మ నాన్న అన్నయ్యతో తన బాల్యమంతా గడిపిన ఇల్లు... ఒక్కసారి కాలం ఇరువై అయిదు సంవత్సరాల వెనక్కి పోయిన ఫీలింగ్.

"అశోక్...ఇది...ఈ ఇల్లేనా... నీవు చూపించాలనుకున్నది" అనుమానంగా అడిగాను.

"అవును సార్..... ఏంటిసార్ అట్లా అడిగారు" అన్నాడు అశోక్.

"ఆహా.. ఏం లేదు... ఓనర్ ఆనందరావు గారే కదూ..." అనుమాన నివృత్తి కొరకు అడిగాను.

"అవును సార్.. ఆయన మీకు తెలుసా;" అంటూ గేటు తీసుకొని లోపలికి నడుస్తుండగా అన్నాడు అశోక్. పాతకాలపు గేటు. బలంగా దృఢంగా ఉంది. అదే ఆకుపచ్చరంగు 'హరిత కుటీర్' బంగారు రంగు అక్షరాలు. కిర్రుమంటూ చప్పుడు చేస్తూ తెరుచుకుంది గేటు. నేలమీద కాలు పెట్టగానే మెత్తగా చల్లగా తగిలించి పచ్చని పచ్చిక. ఏపుగా పెరిగిన మొక్కలు, అదిగో ఆ మూలన చిన్నప్పుడు తనూ అన్నయ్య పోటీలు పడి పళ్ళు కోసుకున్న నేరేడు చెట్టు. ఆ పక్కన నిండా కాయలతో జామచెట్టు. కాలం తెచ్చే మార్పులకు అతీతంగా ఎప్పటిలాగే ఉన్న ఇల్లు.

డోర్ బెల్ నొక్కిన పదినిమిషాలకు మెల్లిగా తలుపు తెరుచుకుంది. డెబ్బై ఏళ్ళు పైబడ్డ వృద్ధుడు. కళ్ళజోడు సరిచేసుకుంటూ తేరిపార చూశాడు. నమస్తే సాబ్... నేను అశోక్‌ను... ఇల్లు చూయించడానికి వచ్చాను. వీరు... గౌతమ్ గారని బ్యాంకు ఆఫీసరు... పరిచయం చేస్తున్నాడు అశోక్.

నేను సంభ్రమాశ్చర్యాలతో ఆనందరావుగారి పాదాలు తాకి... అంకుల్‌నేను గౌతమ్‌ని ఈ ఇంట్లో పాతిక సంవత్సరాల క్రితం అద్దెకు ఉండేవాళ్లం. వాసుదేవరావుగారు మా నాన్నగారు. జ్ఞాపకాల పొరలు చీలుస్తూ గుర్తు చేశాను.

ఓ గౌతమ్. ఎన్నాళ్ళకు చూశానయ్యా నిన్ను. అమ్మా నాన్న గార్లు పోయారట కదా తెలిసింది. అభీ... ఎక్కడున్నాడు.

అన్నయ్య... ఢిల్లీలో సెటిల్ అయ్యాడంకుల్. నాకు ఇక్కడికే ట్రాన్స్‌ఫర్ అయింది. ఇల్లు కొరకు వెతుకుతున్నాను. నా ఫ్రెండు మిత్ర అని.. ఈ అశోక్‌ను పరిచయం చేశాడు. అంటూ అశోక్ వైపు చూశాను. అతని మొహంలో ఒకింత అసహనం.

మంచిపని చేశావయ్యా, అశోక్. ఎలాగైతేనే మా గౌతమ్‌ను కలిపావు. అశోక్ ఈ పూట ఇక్కడే ఉంటాడుగాని నీవు వెళ్ళు. మనం తర్వాత మాట్లాడుకుందాం అన్నాడు ఆనందరావు అంకుల్.

అయిష్టంగానే లేచి వెళ్ళిపోయాడు అశోక్.

రా గౌతమ్ నీ చిన్ననాటి ఇంటిని చూసుకుందువుగాని అంటూ ఇంట్లోకి దారితీశాడు

అంకుల్.

కిందభాగంలో డ్రాయింగ్‌రూం హాలు కిచెన్... పైన ఓ హాలు మూడు బెడ్‌రూంలు ఉన్న డూప్లెక్స్ ఇల్లు అది. అంకుల్ నాన్నగారి ఫ్రెండ్ కావడాన ఇల్లు విశాలంగా సౌకర్యంగా ఉండటం వల్ల తన పుట్టుక ముందునుండి తనకు పది పన్నెండేండ్లు వచ్చేవరకు ఆ ఇంట్లోనే ఉన్నాము. అసలు ఆ ఇల్లు అద్దె ఇల్లు అన్న సంగతే తనకు తెలియదు అప్పుడు. తను అన్నయ్య అభి సెలవురోజుల్లో రోజంతా పెరట్లోనే ఉండేవాళ్ళం. హైడ్ అండ్ సీక్, క్రికెట్ ఒక్కటేమిటి అన్నిరకాల ఆటలు ఆడేవాళ్లం. పైన గదుల్లో తమిద్దరికి ఒక గది ఉండేది ప్రత్యేకంగా ఉత్తరం దక్షిణాలకు బాల్కనీ ఉన్న ఆ గదిలోకి గాలి వెల్తురు పుష్కలంగా వచ్చేవి. సాయంత్రాలు బాల్కనీలో కూర్చుని డ్రాయింగ్ వేసుకోవడం కథల పుస్తకాలు చదువుకోవడం చేసేవాళ్ళం. అయితే వేసవి కాలం మాత్రం పడమటి ఎండ పడటం వల్ల గది ఓవెన్‌లా కాలిపోయేది. మధ్యాహ్నాలు భరించలేని వేడి. చికాగ్గా ఉండేది. అన్ని గదులు చూస్తూ చివరగా నా గదిలోకి వచ్చాము. ఆశ్చర్యం బయట ఎండగా ఉన్నా గదిలో చల్లగా ఏసి పెట్టినట్లుగా ఉంది. బాల్కనీ వైపు తలుపు తీశారు అంకుల్. అద్భుతం.. పచ్చని పందిరిలా బాల్కనీలోకి పరుచుకున్న మామిడి చెట్టు. గుత్తులు గుత్తులుగా విరగగాసిన మామిడిపిందెలు. ఆశ్చర్యంగా చూస్తూ అంకుల్... అప్పుడు ఈ చెట్టు లేదు కదా... అన్నాను.

అరె మర్చిపోయావా ! గౌతమ్. ఈ చెట్టు నీవు పెట్టిందే. ఆ రోజు... నీ బర్త్‌డే... మీ ఊర్నుండి మీ తాతగారు వచ్చారు. అవును అంకుల్ చెబుతుంటే గుర్తొచ్చింది.

అది నా పదకొండే బర్త్‌డే... ఎన్నాళ్ళనుండో ఎదురు చూస్తున్నాను ఆ రోజు కొరకు. అమ్మ చేసే స్వీట్స్ నాన్న ఇచ్చే బర్త్‌డే ప్రజెంట్. స్నేహితులు, బర్త్‌డే కేక్, సరదా, సరదా ఆటలు. ఆ రోజు స్పెషాలిటి ఊర్నుండి తాతగారు రావడం, బుట్ట నిండా మామిడి పళ్ళతో అరటి గెలతో ఆటో దిగిన తాతగార్ని చూడగానే మా ఊరే హైద్రాబాదు వచ్చినంత సంబరం. తాతయ్య తనకొరకు తన బర్త్‌డేకు ఏం ప్రజెంట్ చెయ్యబోతున్నాడు. తనెంతో ఉత్కంఠగా ఎదురు చూస్తున్నాడు. తాతయ్య నీకు మామిడితోట ప్రజెంట్ చేస్తాడటరా అంది అమ్మ వేళాకోళంగా... ముసిముసిగా నవ్వాడు తాతయ్య గుబురు మీసాల చాటుగా. సాయంత్రం అయింది బర్త్‌డే సందడి మొదలయ్యింది. గెస్టులంతా వచ్చారు. ఇంటి ఓనరు ఆనందరావుగారు కూడా వచ్చారు. స్నేహితులు పార్టీ బహుమతులు ఈ సందట్లో తాతగారి బహుమతి విషయం మరిచిపోయాను. అంతా వెళ్ళిపోయాక వచ్చిన బహుమతులనన్నిటిని ఒక్కొక్కటే విప్పి చూస్తుండగా గుర్తొచ్చింది. తాతగారి బహుమతి ఇవ్వలేదని. వెంటనే తాతగారి దగ్గరికి వెళ్ళి నా బహుమతి ఏది తాతయ్యా అంటూ అడిగాను డిమాండ్ చేస్తున్నట్లుగా. ఓరి ! ఇప్పుడు గుర్తొచ్చిందా ఏం బహుమతి ఇవ్వకుండా నీ బర్త్‌డేకు రాకూడదా ఏం అన్నాడు నవ్వుతూ. ఊహు. ఎవరైనా బర్త్‌డేకు వట్టి చేతుల్తో వస్తారా ఏమిటి అమ్మ ఎవరిదైనా బర్త్‌డే ఫంక్షన్‌కు వెళ్ళేటప్పుడు అనే మాటను అచ్చంగా అమ్మలాగా అన్నాను. అంతా నవ్వారు.

పద నీ బహుమతి చూపిస్తాను అంటూ వరండాలోకి తీసుకెళ్ళారు తాతగారు. ఓ మూలగా పెట్టి ఉన్న పాలథిన్ కవర్లో జాగ్రత్తగా మట్టితో కూడా ఉన్న మామిడిమొక్క. ఇదేరా నీ బహుమతి. ఈ చెట్టును నీ పుట్టినరోజుకు గుర్తుగా నీ రూం వెనకాల నాటు. నీతోపాటు పెద్దదయి నీకు తోడవుతుంది. అన్నాడు ఆ మొక్కను నా చేతుల్లో పెడుతూ.

నాకేం సంతోషం కలుగలేదు. ఈ మొక్కనా.. ఇదెన్నడు పెరిగేను. అయినా ఇదేం బహుమతి ఏదైనా ఆటవస్తువు.. క్రికెట్ బ్యాట్ అన్నా ఇవ్వాలి గాని... పోనీ ఏదైనా కొనుక్కోరా... అంటూ డబ్బులైనా ఇవ్వొచ్చుగా. నిరాశతో కృంగి పోయింది నా మనసు.

ఏరా బహుమతి నీకు నచ్చలేదా.

ఊహూ అయినా ఇదేం బహుమతి తాతయ్యా ! మా ఫ్రెండ్స్ చూస్తే నవ్వుతారు... కళ్ళల్లో నీళ్ళు తిరుగుతుండగా తలొంచుకున్నాను. తాతయ్య నా తలమీద చెయ్యేసి... ఏడవకు గౌతమ్... రేపు నీకు నీ కిష్టమైన బహుమతి కొనిస్తాలే... అయితే ఈ మొక్కను మాత్రం నీ చేతుల్తో నాటాలి.. సరేనా అంటూ ఓదార్చాడు. అన్నట్టుగానే ఆ రోజు పొద్దున్నే నా రూం ప్రక్కగా గుంట త్రవ్వించి మొక్కను నా చేత నాటించాడు. తరువాత రెండొందలు నా చేతుల్లో పెడుతూ ఈ డబ్బులు పెట్టి నీ కిష్టమైన క్రికెట్ బ్యాట్ కొనుక్కో గౌతమ్. నేను మధ్యాహ్నం ట్రైన్‌కు వెళ్ళాలి. ఈసారి ఊరికి వచ్చినప్పుడు మామిడితోట రాసిస్తాలే అన్నాడు తాతగారు.

ఆ రోజు తాతయ్య బహుమతి అంత విలువైనదిగా కనిపించలేదు. కాని ఈ రోజు ఆకాశమంత విస్తరించి నిండా కాయల్తో తాతయ్య బోసి నవ్వంత అందంగా ఉన్న మామిడిచెట్టును చూస్తుంటే ఈ బహుమతికి మించింది మరేముంటుంది అనిపించింది. ఏ గౌతమ్ గుర్తొచ్చిందా.. మీ తాతగారి గుర్తుగా నీవు నాటిన ఈ మామిడి మొక్క ఎంత పెద్దదయిందో.

అంకుల్... ఈ ఇంటికి మీరు చెబుతున్న ధర నా శక్తికి మించిందే కాని... నేను... ఎలాగైనా ఈ ఇంటిని కొనుక్కుంటాను అంకుల్. ప్రస్తుతం నా దగ్గర ఉన్న మొత్తం ఇస్తాను. మిగతా అమౌంట్ ఇన్‌స్టాల్‌మెంట్‌లో చెల్లిస్తాను. మీ అబ్బాయితో మాట్లాడి ఒప్పించండి.

ఓకే.. మైబోయ్... ఈ ఇల్లు నా స్వార్జితం. నీ కోసం ధర తగ్గిస్తే నన్నెవ్వరూ శిక్షించరు. అభయమిచ్చాడు అంకుల్. ఆ రోజు తాతయ్య బహుమతి విలువ నాకు తెలియదు. కాని ఈ రోజు అదే బహుమతి ఈ ఇంటిని నాకొక అపురూపమైన బహుమతిగా నా జీవితంలోకి తెచ్చింది అనుకున్నాను.



హైదరాబాద్‌లు యువకళావాహిని ఆధ్వర్యంలో జరిగిన సభలో ద్వాదశి లక్ష్మీప్రసన్న కృష్ణశాస్త్రి స్మారక పురస్కారాన్ని శ్రీమతి జి. సత్యవాణికి అందజేస్తున్న డా॥సి. నారాయణరెడ్డి, చిత్రంలో శ్రీ కళాదీక్షితులు, డా॥ ద్వానాశాస్త్రి, కళాప్రపూర్ణ రావూరి భరద్వాజలను చూడవచ్చు.